# రాజధాని పనులకు గ్రీన్ ఛానల్‌లో గ్రావెల్!

### -సింగిల్ విండో కింద ఎన్‌వోసీలు, లీజు దరఖాస్తుల పరిష్కారం
### -ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్, పోలీసు కమిషనర్

**విజయవాడ తూర్పు, ఫిబ్రవరి 9,(ప్రభాతవార్త ) :** రాజధాని అమరావతి పనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో మౌలిక వసతుల పనులకు అవసరమైన గ్రావెల్‌ను గ్రీన్ ఛానల్ ద్వారా సరఫరా చేసేందుకు సమన్వయ శాఖల అధికారులతో కలిసి కృషిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల మూడో సదస్సు రాష్ట్ర సచివాలయంలో సోమవారం జరిగింది. ఈ సదస్సుకు కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు విజయవాడలోని కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్సు హాలు ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గ్రావెల్, మెటీరియల్ సరఫరాకు ఎక్కడా ఎలాంటి అడ్డంకులు లేకుండా జిల్లాలో తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రికి వివరించారు. రహదారులు, ఇతర నిర్మాణ పనులకు అవసరమైన గ్రావెల్ వంటి వాటికి కొరత లేకుండా చూస్తున్నామని, ఇటీవల జిల్లాస్థాయి ప్రత్యేక కమిటీ సమావేశం కూడా నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుత లీజులను సమీక్షించుకుంటూ కొత్తవాటి క్వారీ లీజుల






దరఖాస్తులను వీలైనంత త్వరగా సింగిల్ విండో ద్వారా పరిష్కరించేందుకు చొరవ చూపుతున్నట్లు తెలిపారు. మైన్స్, అటవీ, పర్యావరణ శాఖ అధికారులతో కూడిన బృందాలు సంయుక్తంగా తనిఖీ చేసి ప్రక్రియను చేపడుతున్నాయని వివరించారు. ప్రభుత్వ విధానాలు, చట్టాలు, పర్యావరణ నిబంధనలను పూర్తిగా పాటిస్తూ గ్రావెల్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూస్తామని, ఈ అంశాన్ని జిల్లా స్థాయిలో అత్యంత ముఖ్యమైన కార్యాచరణగా పరిగణించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

# అర్జీదారులకు సమస్యలకు శాశ్వత పరిష్కారం అందిస్తామన్న భరోసానివ్వండి : కమిషనర్

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 9,ప్రభాతవార్త:** అర్జీదారులకు వారి సమస్యలకు శాశ్వతమైన పరిష్కారం అందిస్తామన్న భరోసాని ఇవ్వడమే 26 ఫిర్యాదులను ఆయన అందుకున్నారు. వాటిలో పట్టణ ప్రణాళికకు సంబంధించి-8, ఇంజనీరింగ్-4, పబ్లిక్ హెల్త్-4, ఎస్టేట్-1




కాకుండా సత్వరమే పరిష్కారం అందించేటట్లు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యను అధికారులందరూ క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఈ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఉన్నాయి.కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్ (ప్రాజెక్ట్స్)డాక్టర్ డి.చంద్రశేఖర్,అడిషనల్ కమీషనర్ (జనరల్) ఎ.రవీంద్రరావు,చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు,చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్,చీఫ్ ఇంజనీర్ ఇన్‌ఛార్జి పి.సత్యకుమారి,డిప్యూటీ కమీషనర్(రెవెన్యూ)జి.సృజన,డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్,అకౌంట్స్ ఆఫీసర్ సత్యన్నారాయణ మూర్తి,వెటర్నరీ అసిసెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దోచుకోవడంలో వైకాపా ప్రభుత్వం తిరుమలను కూడా వదిలిపెట్టలేదు

**నందిగామ, ఫిబ్రవరి9, ప్రభాతవార్త:** తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ కల్తీ జరిగింది. లడ్డూ అపవిత్రం చేసిన వైసీపీకి శిక్ష తప్పదు అని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు మరియు నందిగామ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త




తంబళ్ళపల్లి రమాదేవి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు మరియు జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు తిరుమల లడ్డు కల్తీ వ్యవహారంపై నందిగామ నియోజకవర్గం జనసేన పార్టీ ప్రధాన కార్యాలయం నందు జనసేన నాయకులు, జనసైనికులతో కలిసి ప్రెస్ మీట్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం బోర్డ్ మెంబర్ తంబళ్ళ పల్లి రమాదేవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేయని అక్రమాలంటూ ఏమీలేవనిలే అందులో ముఖ్యంగా తిరుమల శ్రీవారి పవిత్రప్రసాదమైన లడ్డులో ఉపయోగించే నెయ్యిలో కల్తీ నెయ్యి ఉపయోగించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు మరియు యావత్ హిందువుల మనోభావాలను దెబ్బతీశారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంటిన తిరుమల క్షేత్రాన్ని గత ప్రభుత్వం ఎంత అపవిత్రం చేశారంటే, వీరి యొక్క స్వలాభం కోసం దర్శన టికెట్ల రేట్లు పెంచడం, శేషాచలం అడవుల్లో ఎర్రచందనం స్మగ్లింగ్ చేయడం, ప్రసాదాల నాణ్యత తగ్గించడం ఇలా చెప్పుకుంటూ పోతే వీరు ఐదు సంవత్సరాల కాల పరిమితిలో చేయని దోపిడీ అంటూ లేదు అని తెలిపారు. ఇలా చేసి సామాన్య భక్తులు తిరుమలకు రావడానికి భయపడేలా చేశారన్నారు. నేడు సీట్ ఇచ్చిన నివేదికలో గత ప్రభుత్వం యొక్క అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. సాక్షాత్తు కలియు దైవం శ్రీ వెంకటేశ్వరస్వామికి వీరు ఇలాంటి పాపాలకు వడిగట్టారు అంటే, ఇక రాష్ట్ర ప్రజల విషయంలో వీరు ఎంతకైనా తెగిస్తారని చెప్పనవసరం లేదు. ఈ విషయాన్ని సనాతన ధర్మసం పాటించే ప్రతి ఒక్క హిందువు మరియు శ్రీవారి భక్తులు తీవ్రంగా ఖండించాలని కోరుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన ఇలాంటి దాష్టికాలను తెలుసుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కల్యాణ్ ఆనాడు ప్రాయశ్చిత్త దీక్ష తీసుకొని పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో జరిగిన అపచారాన్ని ప్రపంచానికి తెలియజేశారు. ప్రతి హిందువు తెలుసుకోవలసిన ముఖ్యమైన విషయం, భారతదేశం ఒక్కటే హిందువులకు ఉన్న ఏకైక దేశం అని పవన్ కళ్యాణ్ పదేపదే అనేవారని రమాదేవి తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి మరియు వైవి సుబ్బారెడ్డి బహిరంగంగా భక్తులకు క్షమాపణ చెప్పాలని రమాదేవి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జజ్జూరు పిఏసిఎస్ ఛైర్మన్ రహీమతుల్లా, బొమ్మిశెట్టి భాస్కరరావు కొమ్మా నరేష్, పురమ కాలేశ్వరరావు, ఎర్ర బడి సురేష్, కొట్టే హరికృష్ణ, ఆకుల వెంకట్, ఐలపోగు నాగేంద్ర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వావిలాల హైస్కూల్ అభివృద్ధి పై ప్రజా వేదికలో ఫిర్యాదు

తిరువూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త : వావిలాల గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాల హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయ్యి సంవత్సర కాలం గడుస్తున్నా నేటికి ప్రభుత్వం వారు హైస్కూల్ కొరకు స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయుట గురించి "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" (పిజిఆర్ఎస్)లో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు మారబత్తుల గోపాల్ మాదిగ ఫిర్యాదు సమర్పించి, ప్రభుత్వం వారు తక్షణమే స్పందించి హైస్కూల్‌కు స్థలము కేటాయించి,



హైస్కూల్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయవలసిందిగా కోరారు.తద్వారా వావిలాల మరియు చుట్టు ప్రక్కల గల గ్రామాలలో వున్న నిరుపేద, దళిత, బహుజన, విద్యార్థినీ విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకువచ్చి గ్రామీణ ప్రాంతం వారికి న్యాయం చేసిన వారవుతారని ప్రభుత్వానికి ఉద్యమ నమస్సులతో విజ్ఞప్తి చేశారు.

# విజయవాడ వార్త

# ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి

- ఆర్థిక సూచికల్లో ప్రగతికి నిరంతర కృషి
- జీడీడీపీ, జీవీఏ, పీసీఐలో లక్ష్యాల సాధనకు అడుగులు
- 17 ప్రధాన రంగాల్లో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- 555 కేపీఐల్లో జిల్లాను ముందంజలో నిలిపేందుకు ప్రణాళికలు

**కలెక్టర్ జి లక్ష్మీశ**

**విజయవాడ, ఫిబ్రవరి 9,(ప్రభాతవార్త) :** జిల్లా స్థూల ఉత్పత్తి (జీడీడీపీ)తో పాటు స్థూల విలువ జోడింపు, తలసరి ఆదాయం వంటి ప్రధానమైన ఆర్థిక సూచికల్లో జిల్లాను ఎప్పుడూ ముందంజలో నిలిపేందుకు అధికార యంత్రాంగం కృషిచేస్తోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మంత్రులు, కార్యదర్శుల మూడో సదస్సు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సోమవారం రాష్ట్ర సచివాలయంలో జరిగింది. ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు విజయవాడ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా హాజరయ్యారు. 202526 భారత ఆర్థిక సర్వేలోని ముఖ్యాంశాలతో పాటు రాష్ట్ర ఆర్థిక సూచికలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించడంతో పాటు జిల్లాల సూచికలనూ ఈ సమావేశంలో ముఖ్యమంత్రి వివరించారు. జిల్లాలు తద్వారా రాష్ట్రం ప్రగతి పథంలో పయనించేందుకు క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సుపరిపాలన మూడు అంశాల్లో పురోగతికి సూచనలు చేశారు. నైపుణ్యాభివృద్ధి, డేటా లేక్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఒక కుటుంబంఒక పారిశ్రామికవేత్త, శాంతిభద్రతలు తదితరాలపై సమావేశంలో చర్చించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ తొలి ముందస్తు అంచనాల ప్రకారం రూ. 1,05,173 కోట్ల జీడీడీపీతో ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందన్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తికి జిల్లా 5.97 శాతం వాటా అందిస్తోందని, రూ. 3,91,390 తలసరి ఆదాయంతో ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో ఉందన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలతో పాటు పారిశ్రామిక, సేవారంగాల్లో అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

**555 ప్రగతి సూచికలపై ప్రత్యేక దృష్టి:**

స్వర్ణాంధ్ర 2047లో భాగంగా జిల్లా, నియోజకవర్గానికి దార్శనిక ప్రణాళికలు ఉన్నాయని, ఈ ప్రణాళికలను సమర్థవంతంగా అమలుచేస్తూ లక్ష్యాలను చేరుకునేందుకు అధికారులు కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఈ సందర్భంగా సూచించారు. అభివృద్ధికి మరింత అవకాశమున్న పశుసంవర్ధక రంగం, తయారీ రంగం, ఫిషింగ్ అండ్ ఆక్వాకల్చర్, సర్వీసులు, ఉద్యాన తదితర 17 రంగాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని పేర్కొన్నారు. 555 కీలక ప్రగతి సూచికల(కేపీఐ)పై నిరంతరం పర్యవేక్షించడం జరుగుతోందని, లక్ష్యాలకు అనుగుణంగా ఈ సూచికల్లో వృద్ధి నమోదుకు కృషిచేయాలని స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో జిల్లాను ముందంజలో నిలిపేందుకు రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా మంచి ఫలితాల సాధనలో కీలక భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విజయవాడ కూడా ఉన్నందున ఇక్కడ సర్వీస్ సెక్టార్ అభివృద్ధికి పుష్కల అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నామని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. డ్రగ్స్‌పై దండయాత్ర నినాదంతో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా నిరంతరం అప్రమత్తతతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో వినూత్నంగా తీసుకుంటున్న చర్యల వల్ల వివిధ రకాల నేరాలు గణనీయంగా తగ్గుముఖం పడుతున్నాయన్నారు.

# మేరీ మాత ఉత్సవాల్లో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూస్తున్నాం : కమీషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 9,ప్రభాతవార్త :** ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా,త్రాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణలో లోపం లేకుండా చూసుకుంటున్నామని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. ఈ నెల 9,10,11 తేదీల్లో జరిగే గుణదల మేరీ మాత ఉత్సవాల్లో పాల్గొనే ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తున్నామన్నారు. భక్తుల కోసం 2వేల లీటర్ల కెపాసిటీ గల 5 స్టీలు ట్యాంకర్లలో గ్రానునీరు,50 వేల వాటర్ బాటిళ్ళు,440 పారిశుద్ధ్య కార్మికులతో పారిశుద్ధ్య నిర్వహణ,2 ప్రదేశాలలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాలకు వచ్చే మేరీ మాత భక్తులకు నగరపాలక సంస్థ వారు కలి ్పంచే త్రాగునీటి సరఫరా,పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ నిత్యం పర్యవేక్షిస్తూ ఉన్నారన్నారు.



# సిపి కార్యాలయంకు 87 ఫిర్యాదులు

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 9,ప్రభాతవార్త:** పోలీస్ కమీషనర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిసిపి ఎబిటిఎస్ ఉదయరాణి ప్రజల నుండి 87 ఫిర్యాదులను స్వీకరించారు. సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆమె నిర్వహించారు. వీటిలో భూ,ఆస్థి



వివాదాలు,నగదు లావాదేవీలకు సంబంధించి-49, భార్యాభర్తలు,కుటుంబ కలహాలకు సంబంధించి-4, వివిధ మోసాలకు సంబంధించి-12,మహిళా సంబంధిత నేరాలకు సంబంధించి-5,చోరీలకు సంబంధించి-1,కొట్లాటలకు సంబంధించి-1,ఇతర వివిధ సమస్యలకు సంబంధించి-15 ఫిర్యాదులను ఆమె అందుకున్నారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొని ఫిర్యాదుల పరిష్కారానికి సహకరించారు.

# రహదారి అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బోడెప్రసాద్

**కంకిపాడు ఫిబ్రవరి9,ప్రభాతవార్త :** రంజాన్ పండుగ సమయానికి ముస్లిం సోదరులకు సనత్‌నగర్ ప్రధాన రహదారి అభివృద్ధి పనులను పూర్తిచేసి మెరుగైన వాతావరణాన్ని కల్పిస్తామని పెనమలూరు ఎమ్మెల్యే బోడేప్రసాద్ హామీఇచ్చారు. సోమవారం చినుకు పడితే



నీరు నిలుస్తున్న రహదారి పనులను ఆయన పరిశీలించారు.పెనమలూరు నియోజకవర్గం తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ముస్లింమైనార్టీ సోదరులకు సనత్‌నగర్ ప్రాంతంలో మెరుగైన మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేసే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించి పనిచేస్తున్నామన్నారు.రంజాన్ పండుగ సమయానికల్లా నూతన నిర్మాణం పూర్తి చేయడంద్వారా ముస్లిం సోదరులకు పండుగ వాతావరణాన్ని కల్పించేలా ప్రత్యేక దృష్టితో పనిచేస్తున్నామని తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ వర్గాల అభ్యున్నతి,సంక్షేమం అభివృద్ధి దిశగా కూటమినేతలు నడుం బిగించారని స్పష్టం చేసారు.

# కిడ్నీ బాధిత మండలాల్లో వెంటనే వ్యాధి నిరోధక చర్యలు చేపట్టాలి

### -సిపిఐ రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసరావు

**ఎ కొండూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** ఎన్టీఆర్ జిల్లాలో కిడ్నీ ప్రభావిత బాధిత మండలాల్లో అవసరమైన వ్యాధి నిరోధక చర్యలు చేపట్టి శాశ్వత నివారణకు ప్రభుత్వం కృషి చేయాలని సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ జిల్లాలో కిడ్నీ ప్రభావిత మండలాల్లో బాధితులకు రోగులకు కిడ్నీ ఆసుపత్రుల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని అలాగే బ్లడ్ యూనిట్ ఇంజక్షన్స్ సోడియం బైకార్బోనేట్ వంటి మందులు ఫార్మసిస్టులు ల్యాబ్ టెక్నీషియనన్స ఇతర మౌలిక సదు పాయాలు కల్పించాలని శ్రీనివాసరావు కోరారు. అలాగే శుద్ధి చేసిన కృష్ణా జలాలు నీటిని ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా సరఫరా చేయాలని ఈ కిడ్నీ మహమ్మారి జబ్బు తో



మృతి చెందిన బాధిత కుటుంబాలక కనీసం 1 ఎకరం సాగుభూమి కేటాయించి బాధిత ఎస్సీ, ఎస్టీ బిసి మైనార్టీ వర్గాలను ఆదుకోవాలని శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# వీధిలో పగటిపూట వెలుగుతున్న ఎల్ఈడి విద్యుత్తు దీపాలు

**ఎ కొండూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలోని 4 మండలాల్లో ఎల్ఈడి విద్యుద్దీపాలు పగలు కూడా కాంతులు వెదజల్లుతుండడంతో ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ నిర్లక్ష్యంతో విద్యుత్ వృదా వాడకం జరుగుతోందని, అటు ప్రభుత్వానికి ఏర్పడిన నష్టాన్ని వినియోగదారులపై ప్రయోగిస్తోందని పలువురు ఆరోపించారు. ఇకనైనా ఈ నియోజకవర్గంలోని 4 మండలాల్లో రాత్రి పూటతో పాటు పగటిపూట నిరుపయోగంగా వెలుగుతున్న బల్బులను వీధి దీపాలను పగటిపూట ఆపివేసే విధంగా చర్యలు తీసుకుని వినియోగదారుడిపై పడుతున్న భారాన్ని తొలగించడానికి విద్యుత్ ఆదా చేసి ఆదుకోవాలని పలువురు వినియోగదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# చీమలపాడు- కుదప -విస్సన్నపేట రూటులో అధనంగా రెండు సర్వీసు బస్సులను ఏర్పాటు చేయాలి

**ఎ కొండూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** విజయవాడ ఆర్టీసి డిపో నుండి విజయవాడ ఇబ్రహీంపట్నం మైలవరం చీమలపాడు కుదప మాధవరం మీదుగా విసన్నపేటకు నడుస్తున్న హైర్ బస్సుల వల్ల ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రూటులో నడుస్తున్న అద్దెబస్సులు ప్రస్తుతం స్త్రీశక్తి పథకం, ఉచిత బస్సుల సౌకర్యం వల్ల ప్రయాణీకుల సంఖ్య ముఖ్యంగా మహిళల సంఖ్య పెరగడంతో బస్సుల్లో ప్రయాణీకుల రద్దీ బాగా పెరగడంతో పురుష ప్రయాణీకులకు టికెట్లు కొనుగోలు చేసినా సీట్లు ఉండడం లేదని అందువల్ల ఈ రహదారిలో ప్రస్తుతం ఉన్న హైర్ అద్దె బస్సుల స్థానంలో మరో రెండు అదనంగా ఆర్టీసి సంస్థ బస్సులు నడపాలని ఈ ప్రాంత ప్రయానీకులు ఉద్యోగులు వ్యాపారులు విద్యార్థులు విజయవాడ ఆర్టీసి రీజనల్ మేనేజర్ ఆర్ఎంకు విజ్ఞప్తి చేశారు.

### వైభవంగా ప్రారంభమైన గుణదల లూర్దుమాత

# 102వ మహోత్సవాలు

**విజయవాడ, జనవరి 9, ప్రభాతవార్త :** జూబిలేరియన్ రెవ. ఫాదర్ నేలటూరి ఫ్రాన్సిస్ (కెనడా) తల్లి శ్రీసభలో మరియమాత సమైఖ్యమాతగా గుర్తించబడిందని తెలిపారు. ఉదయం 7 గంటలకు బిషప్ గ్రాసి హైస్కూల్ గ్రౌండ్లో ప్రత్యేకంగా అలంకరించిన కళావేదికపై విజయవాడ కతోలిక పీఠం బిషప్ (పీఠాధిపతులు) మద్దాల జోసఫ్ (అమెరికా) తదితర గురువులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రపంచంలోని ప్రసిద్ధిచెందిన పుణ్యక్షేత్రాలలో ఘనతకెక్కి గుణదల కొండపై కొలువైన లూర్దుమాత 102వ మహోత్సవ వేడుకలను సోమవారం అధికారికంగా ప్రారంభించారు. ముందుగా బిషప్ జోసఫ్ రాజారావు డయోసిస్ గురువులతో కలిసి బిషప్ గ్రాసి





తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ రెవ. ఫాదర్ మేశపాం గాబ్రియేలు, పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు స్వామి, ఎస్ఎస్సి డైరెక్టర్ రెవ. ఫాదర్ తోట సునీల్ రాజు, సిల్వర్ జూబిలేరియన్ రెవ. ఫాదర్ హైస్కూల్ గ్రౌండ్లో లూర్దుమాత స్వరూపాన్ని ఊరేగింపుగా పవిత్ర పూజావేదిక వద్దకు తీసుకువచ్చి, వేదికపై తల్లి లూర్దుమాతను ప్రతిష్టించారు.అనంతరం పవిత్ర కళావేదికపై ఉత్సవాల ప్రారంభ సమిష్టి దివ్యపూజాబలి సమర్పించారు.

# న్యాయవాదుల పై దాడులు చేస్తే సహించేది లేదు

**నందిగామ,ఫిబ్రవరి9, ప్రభాతవార్త:** న్యాయవ్యవస్థను కాపాడే న్యాయవాదులపై తరుచూ హత్యలు, హత్యప్రయత్నాల దాడులు చేస్తున్న వ్యక్తులపై కఠినమైన చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ నందిగామ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వరదబోయిన విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నందిగామ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి, నిరసనతెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని , న్యాయవాదులకు భరోసా భద్రత కల్పించవలసని బాధ్యత ప్రభుత్వాలదేనని, తరుచూ జరుగుతున్న దాడుల



సంఘటనలు వలన న్యాయవాదుల్లో ఆత్మధైర్యం దెబ్బతింటుందని, మన రాష్ట్రంలో ఉన్న అన్ని బార్ అసోసియేషన్ వారు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వానికి లేఖల ద్వారా న్యాయవాదుల రక్షణ చట్టంపై తెలియపరచాలని కోరినారు. బార్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు, ట్రెజరర్ మాడుగుల స్టాలిన్ బాబు, లైబ్రేరియన్ షేక్ ఆజాద్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ చావలి సాంబశివరావు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు వేల్పుల కిషోర్, తాడేపల్లి కాంతారావు, దారెల్లి అరుణ్‌కుమార్, కస్తాల చరణ్, సీనియర్ న్యాయవాదులు మన్నెం నారాయణరావు, కన్నెగంటి జీవరత్నం, పి.వి నరసింహారావు, బండి మల్లికార్జునరావు, చాపల శివరామకృష్ణ, పింగళి లక్ష్మి నరసింహారావు, పెసరమెల్లి సురేష్, మందా వజ్రయ్య, దగ్గుపాటి కమలాకర్ రావు, పంది ప్రకాష్, గంటా నాగేశ్వరరావు, దున్న కోటేశ్వరరావు, పగిడాకుల కృష్ణప్రసాద్ మొగిలిచర్ల లక్ష్మీకాంత్, నెలకుదిటి లక్ష్మీనారాయణ, వేదుల సుబ్రహ్మణ్యం, కొమ్మినేని మౌలేశ్వరావు, నంద్రు శ్రీరామ్మూర్తి, గుడిశ సుమన్, బొలుసు పాటి సురేష్ ,

# బ్రిటీష్ వారి అరాచకాలను గుర్తుచేసిన వైకాపా పాలన

పెనమలూరు ఫిబ్రవరి9,ప్రభాతవార్త : కమీషన్లకు కక్కుర్తిపడి కలియుగదైవం యొక్క ప్రసాదాన్ని కూడా వదలకుండా కలుషితం చేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీదేనని తాడిగడప మున్సిపాలిటీ



కమిటీసభ్యులు జనసేనపార్టీ నాయకులు సమ్మెట సుధాకర్ అన్నారు.సోమవారం జనసేనపార్టీ ఆధ్వర్యాన పోరంకి పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వైసీపీ పై జనసేన నాయకులు మండిపడ్డారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 50సంవత్సరాల నుండి తిరుమల దేవస్థానానికి నందిని డైరీ సప్లై చేస్తున్న నెయ్యిని అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆపి కమీషన్లకు కక్కుర్తిపడి బోలేబాబాడైరీని అనుమతించిందని విరుచుకుపడ్డారు. కల్తీచేయడానికి, దర్శనం టిక్కెట్లు రేట్లు పెంచి దోచుకోవడానికి మాత్రమే వైసీపీ ప్రభుత్వం పనిచేసిందని సూచించారు.అంబటి రాంబాబును టైగర్ అని జగన్మోహనరెడ్డి ప్రస్తావించాడని పులులు,సింహాలు అడవిలో తిరగాలి గాని జనాల మధ్యలో కాదని అందుకే అంబటి బోనులో ఉన్నాడని గుర్తుంచుకోవాలని సూచించారు.ఈడబ్ల్యూఎస్ అని నరేంద్రమోడి వెనుకబడిన అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు ఇస్తే రాష్ట్రంలో ఐదు శాతం తమకే చంద్రబాబు ఇచ్చారని తెలిపారు. వంగవీటి మోహనరంగా పేరు జిల్లాకు పెట్టాలని ఏనాడైనా ప్రస్తావించాడా, ధర్నాలు చేపట్టాడా కాపులకు ఏమి ఉద్ధరించాడని రాంబాబుకు టైగర్ అని కితాబుఇచ్చారని ప్రశ్నించారు. రాంబాబును టైగర్,టైగర్ అని చివరికి సర్కస్ టైగర్‌ని చేసారని ఎద్దేవా చేసారు.కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధిపథంలో తీసుకువెళ్తుందని పెనమలూరు నియోజకవర్గంలో అభివృద్ధి అంటే బోడేప్రసాద్, బోడేప్రసాద్ అంటే అభివృద్ధి అని మమ్మల్ని కలుపుకొని ఐక్యతతో శాశనసభ్యులు పనిచేస్తున్నారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో తాడిగడప జనసేనపార్టీ మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు మాదాసు రాము,డివిజన్ అధ్యక్షుడు రమేష్‌నాయుడు,జనసేన నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలి : నగర మేయర్

**గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 9, (ప్రభాతవార్త) :** గుంటూరు నగరంలో ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్ )లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను శాశ్వతంగా పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర ఆదేశించారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, కార్పొరేషన్ విభాగాలకు చెందిన అధిపతులతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 58 ఫిర్యాదులు రావడం జరిగిందని, ప్రాధాన్యత క్రమంలో నిర్దేశిత గడువులోగా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అధికారులు సమస్యలు పరిష్కరిస్తారనే నమ్మకం ప్రజలకు కలిగించాలని మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సిహెచ్ శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ ఈ




వెంకటేశ్వరరావు, ఎమ్ హెచ్ ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, మేనేజర్ బాలాజీ భాష తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ అటవీ సదస్సులో ఏఎన్‌యు ఫారెస్ట్రీ అధ్యాపకులు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఫిబ్రవరి9, ప్రభాతవార్త: ఏఎన్‌యు ఫారెస్ట్రీ విభాగం అధ్యాపకులు వి.మనోజ్ రెడ్డి, జి.తన్వికలతో కూడిన విద్యార్థుల బృందం న్యూఢిల్లీలోని నేషనల్ అగ్రికల్చరల్ సైన్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన ట్రీస్కేప్స్ 2026 మొదటి ఏషియన్ ఆగ్రో ఫారెస్ట్రీ అండ్ ట్రీస్ అవుట్‌సైడ్ ఫారెస్ట్ పేరుతో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్నారు. ఈ సదస్సులో వ్యవసాయ అటవీ విస్తరణలో సామర్థ్య నిర్మాణం, అటవీ ధృవీకరణ,, చిన్న సన్నకారు రైతులకు సుస్థిర విలువ గొలుసుల అనుసంధానం, వాతావరణ స్థితిస్థాపకత, పర్యావరణ వ్యవస్థ సేవలు, గ్రీన్ ఫైనాన్స్ కార్బన్ ఫైనాన్స్, మార్కెట్ లభ్యత కోసం నూతన ఆర్థిక సాంకేతికతలు, బయో ఎకానమీ, వృక్ష ఆధారిత వ్యవస్థాపకత, వృక్ష జన్యువనరులు, విత్తన నారు వ్యవస్థలు, ఉత్పాదకత, పట్టణ ప్రాంతాల్లో వృక్ష సంపద నిర్వహణ, విధానపరమైన నిబంధనలు, నూతన ఆవిష్కరణలు, అనే అంశాలపై వివిధ రంగాల శాస్త్రవేత్తలు, ప్రభుత్వ



ఉన్నతాధికారులు, పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి జరిపి విలువైన సమాచారాన్ని సేకరించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ఆచార్య కె.మల్లిఖార్జునను వీసి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య ఆర్.శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలు అభినందించారు. విభాగం అధ్యాపకులు, విద్యార్థులు ఇటువంటి సదస్సులలో పాల్గొనడం ద్వారా వారిలో పరిశోధనా పటిమ, నైపుణ్యాలు పెరుగుతాయన్నారు.

# సర్పంచుల సమస్యలపై అదనపు కమిషనర్‌కు వినతి

## బిల్లుల అప్లోడ్‌పై ఆంక్షలు తొలగించాలంటూ ఏపీ సర్పంచుల సంఘం డిమాండ్

**తాడేపల్లి, ఫిబ్రవరి9,ప్రభాతవార్త:** ఏపీ పంచాయతీరాజ్ అదనపు కమిషనర్ డాక్టర్ ఎం. సుధాకర రావుతో సోమవారం తాడేపల్లిలోని కమిషనర్ కార్యాలయంలో ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘం ప్రతినిధులు



సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు పాల్గొన్నారు.గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన మెజర్‌మెంట్ బుక్ పూర్తయినా, స్థానిక నాయకుల జోక్యంతో అనేక చోట్ల బిల్లులు అప్లోడ్ చేయకుండా అడ్డుకుంటున్నారని వారు అదనపు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లు తదితర అత్యవసర పనులకు కూడా బిల్లులు పెట్టేలా కార్యదర్శులు (పీడీఓలు) స్వేచ్ఛగా అప్లోడ్ చేసే విధంగా స్పష్టమైన సర్కులర్ జారీ చేయాలని కోరారు.అలాగే గతంలో జారీ చేసిన సర్క్యులర్‌ను సవరించి, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.సర్పంచుల విన్నపాలను శ్రద్ధగా విన్న అదనపు కమిషనర్ డాక్టర్ ఎం. సుధాకర రావు, ఈ విషయాన్ని ప్రభుత్వంతో పాటు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చారు.

# వెట్టిచాకిరి విముక్తి చట్టానికి 50 ఏళ్ళు

**విజయవాడ తూర్పు, ఫిబ్రవరి 9(ప్రభాతవార్త ) :** వెట్టి చాకిరీ వ్యవస్థ (బాండెడ్ లేబర్) (రద్దు) చట్టం, 1976 అమలులోకి వచ్చి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా వెట్టిచాకిరీ నిర్మూలన, తనిఖీ, పర్యవేక్షణ కమిటీ చైర్‌పర్సన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ నుండి విజయవాడలోని డా. బి.ఆర్. అంబేద్కర్ స్మృతి వనం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా వెట్టిచాకిరీ నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లను జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా విడుదల చేసి, ప్రతిజ్ఞ నిర్వహించిన అనంతరం అవగాహన జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఉప కార్మిక కమిషనర్ జి. ధనలక్ష్మి,




వాసవ్య మహిళ మండలి డైరెక్టర్ డాక్టర్ బి.కీర్తి, పీడీ రామానుజయ్య, కోఆర్డినేటర్ హృదయ రాజు, ఎన్‌జీఓ ఎఫ్ఆర్‌సిఆర్ కోఆర్డినేటర్ రామకృష్ణ, అరవ రమేష్, డీబీఆర్‌సి రమాదేవి, ఈశ్వర్ కళ్యాణ్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# విద్యాదాత ఎన్నారై ఆళ్ల వెంకట్‌కు ఘన సత్కారం

**పెదనందిపాడు ఫిబ్రవరి 9 (ప్రభాతవార్త) :** నాగులపాడు కు చెందిన ఎన్నారై లు ఆళ్ళ వెంకట్ . ఆళ్ల శేషు మాధవ్ లు తమ మిత్రబృందం సహకారంతో పెదనందిపాడులో ని పలు ప్రభుత్వపాఠశాలల లోని పేద



విద్యార్థులు విద్యలో నైపుణ్యం సాధించేందుకు వారికి ప్రత్యేక తరగతులను నిర్వహించేందుకు గాను అదనపు ట్యూటర్లను నియమించి లక్షలాది రూపాయలు వాళ్లకి వేతనాలుగా అందజేస్తు ఈ ప్రాంత విద్యార్థులు వారి తల్లిదండ్రుల మన్ననలు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల యుఎస్ఏ నుండి తమ జన్మభూమికి విచ్చేసిన దాత ఆళ్ల వెంకట్ . సోమవారం పెదనందిపాడు లోని కొత్తపాలెం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు.ఈ సంద సంద్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల విద్యాశాఖాధికారు లు 1. సిహెచ్ రమేష్ బాబు.2 పి జాకబ్ లు పాల్గొని ఉపాధ్యాయులు గురించి ప్రసంగిస్తూ. పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని, విద్యార్థులకు తేలికైన పద్ధతుల్లో విద్య బోధనలు జరపాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం తీసుకోవడం హర్షనీయమన్నారు. దాత (ఎన్నారై) ఆళ్ల వెంకట్ మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం కష్టపడి ఇష్టపడి చదివితేనే విద్య సాకారం అవుతుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని తనలాగా ఉన్నత స్థాయికి ఎదిగి మరి కొంతమంది పేదలకు తమ సహాయ సహకారాలు అందించాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు విద్యా సామాగ్రిని బహుకరించారు. పాఠశాలలో తాము నియమించిన ట్యూషన్ ఉపాధ్యాయులు కె. ప్రవంతి. ఎన్. వెంకాయమ్మ లకు వేతనాల కింద 80 వేల రూపాయలు నగదు అందజేశారు. దాత వెంకట్ ను పాఠశాల సిబ్బంది దుశ్శాలువా, మెమెంటో తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన విశ్రాంత ఉపాధ్యాయిని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మక్కెన జవహర్ రాణి కి పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది బృందం ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె. అనిత . ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి. సీతారామమ్మ . సౌమ్య. శుభాసుందరం. దరియాబి తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీలు ఆరోగ్యంగా ఉంటేనే పుట్టబోయే బిడ్డలు కూడా ఆరోగ్యంగా పుడతారు

**అమరావతి,ఫిబ్రవరి 9,ప్రభాతవార్త :** గర్భిణీలు ఆరోగ్యంగా ఉంటేనే పొట్ట పోయే బిడ్డలు కూడా ఆరోగ్యవంతంగా పుడతారని, గర్భిణీలు ఎవరు ఆకలితో ఇంటికి వెళ్లకూడదని జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు గర్భిణీలకు చేస్తున్న సేవలు అభినందనీయమని సామాజిక ఆరోగ్య కేంద్రం స్త్రీల ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ మన్యం వీరాంజనేయులు అన్నారు.మండల కేంద్రమైన అమరావతిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జన చైతన్య




సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెదకూరపాడు కు చెందిన సుబ్రహ్మణ్యేశ్వర మెడికల్స్,ఫ్యాన్సీ స్టోర్ నిర్వాహకులు యామా నరేంద్రబాబు సహకారమతో వారి కుమార్తె వెంకట ప్రణవి జన్మదిన సందర్భంగా సోమవారం అమరావతి మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి ప్రభుత్వ ఆసుపత్రికి స్కానింగ్ తో పాటు పలు వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణీలకు పోషకాహారాన్ని పంపిణీ చేశారు.ఈసందర్భంగా జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరు సాంబశివరావు మాట్లాడుతూ గర్భిణీలకు పౌష్టికాహారం అందించేందుకు పెద్ద మనసుతో ముందుకు వస్తున్న ప్రతి ఒక్కరు అభినందనీయులని అన్నారు. దాత యామ నరేంద్రబాబు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమంలో గర్భిణీలకు పోషకాహారం అందించడానికి అవకాశం కల్పించిన జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ డాక్టర్ల సూచనలతో గర్భిణీలు జాగ్రత్తలు పాటించి బలమైన పోషకాహారాన్ని తీసుకోవాలని అన్నారు.ఈకార్యక్రమంలో జనచైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్ మాట్లాడుతూ వివిధ గ్రామాల నుండి వచ్చేటువంటి గర్భిణీలు ఆకలితో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రతి నెల 9వ తేదీ పోషకాహారాన్ని పంపిణీ చేస్తున్నమన్నారు.ఈ కార్యక్రమంలో ఆడవాళ్ళ ఆకుల సంఘం కోఆర్డినేటర్ తుండు లక్ష్మణ్, జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు,మేకల శ్రీనివాస రావు,షేక్ సుభాని, మహిళా కోఆర్డినేటర్ షేక్ జుబేదా తదితరులు పాల్గొన్నారు. గర్భిణీలకు పెరుగన్నం,రాగి జావా, కోడిగుడ్లు,యాపిల్ కాయలు,కివి పండ్లు,కమలా కాయలు,అరటి పండ్లు, డ్రైఫ్రూట్ లడ్లు,ఖర్జూర పండ్లు,చిక్కిలు,సున్నుండలు పంపిణీ చేశారు.

# పారిశుద్ధ్య కార్మికులందరూ సమయానికి వస్తున్నారా? ప్రతి రోజు పూడికలు తీస్తున్నారా : కమిషనర్

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 9,ప్రభాతవార్త:** పారిశుధ్య కారి ్మకులందరూ సమయానికి వస్తున్నారా? ప్రతి రోడ్లు ఊడ్చి,డ్రైన్లలో పూడికలు తీస్తున్నారా?పనిముట్లు సరఫరా సరిగా ఉన్నాయా?అని కమీషనర్ ధ్యానచంద్ర తానే స్వయంగా కార్మికులను ప్రశ్నించారు. సోమవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఆయన వేముల శ్యామలాదేవి నగర్,బెత్లెహేమ్ నగర్,ఏలూరు రోడ్డు,పుల్లేటి కాల్వ డ్రైన్,ఈఎస్ఐ హాస్పటల్ ప్రాంతాను పర్యటించి,క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థ సేకరణలో తడి చెత్త,పొడి చెత్త,హానికారక వ్యర్థాలను విడిగా సేకరించాలని, ఇంటి



వద్దనే వ్యర్థ్యాలను విభజించి పెట్టాలని నగర ప్రజలకు తెలియపర్చాలన్నారు. నగరంలో పారిశుధ్ య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, మెరుగైన పారిశుధ్య నిర్వహణ కోసం ఎటువంటి సౌకర్యాలు కావాలన్నా తాము వెనుకాడమన్నారు.అనంతరం ధర్నా చౌక్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని,త్రాగునీరు వాడుక నీటి సరఫరాలో అంతరాయం ఉండరాదన్నారు.

# డ్రోన్ టెక్నాలజీ వినియోగం ద్వారా ట్రాఫిక్ సమస్యల పరిష్కారం : డిసిపి షిరీన్ బేగం

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 9,ప్రభాతవార్త :** బెజవాడలో డ్రోన్ టెక్నాలజీ వినియోగం ద్వారా ట్రాఫిక్ సమస్యలకు అధునిక పరిష్కారాన్ని కనుగొన్నామని ట్రాఫిక్ డిసిపి షరీన్ బేగం పేర్కొన్నారు. సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో రోడ్డు ప్రమాదాలు జరిగే 123 బ్లాక్ స్పాట్‌లను గుర్తించా మన్నారు. వీటిపై తన స్వీయ పర్య వేక్షణలో ఏసిపిలు,సిఐలు వారి వారి సిబ్బందితో కలిసి సదరు బ్లాక్ స్పాట్స్‌లపై డ్రోన్ల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటు న్నామన్నారు. డ్రోన్‌లను ఉపయోగించి బ్లాక్ స్పాట్‌ల వద్ద ట్రాఫిక్ ఎలా ఉంది,వాహనాలు ఏ వేగంతో వెళ్తున్నాయి.రియల్ టైం మానిటరింగ్ చేస్తూ తగు చర్యలు తీసుకుంటు న్నామన్నారు. ఏదైనా బ్లాక్ స్పాట్ వద్ద ట్రాఫిక్ జామ్ అయినప్పుడు,డ్రోన్ల ద్వారా సమస్య ఎక్కడ ఉందో గుర్తించి ట్రాఫిక్‌ను మళ్ళించడానికి చర్యలను తీసుకుంటున్నామన్నారు.ఈ డ్రోన్‌లను ఉపయోగించి బ్లాక్ స్పాట్ వద్ద ప్రమాదం జరిగితే,అంబులెన్స్ లేదా పోలీసులు రావడానికి ముందే డ్రోన్ల ద్వారా పరిస్థితిని అంచనా వేసి తక్షణ సహాయం అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి అనగా నో హెల్మెట్,ట్రిబుల్ డ్రైవింగ్,ర్యాష్ డ్రైవింగ్,సెల్‌ఫోన్ డ్రైవింగ్,వన్ వే డ్రైవింగ్ తదితర ఉల్లంఘనలను డ్రోన్ల ద్వారా గుర్తించి వారిపై చలాన్లు విధించామన్నారు. ఈ డ్రోన్ నిఘా విధానం ద్వారా ప్రయాణీకులకు సురక్షితమైన,సజావుగా వారు ప్రయాణం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆమె తెలిపారు.

# పంచాయతీ కార్యదర్శి శ్వేతకు సమ్మె నోటీసులు అందించిన కార్మికులు

**పెదనందిపాడు ఫిబ్రవరి 9 (ప్రభాతవార్త) :** ఫిబ్రవరి 12 న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సహకరించాలని పెదనందిపాడు గ్రామ పంచాయతీ కార్మికులు సోమవారం పంచాయతీ కార్యదర్శి పి. శ్వేత కు సమ్మె నోటీసు



అందించారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, సిఐటియు మండల నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు లు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాల కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాలు, వందలాది కార్మిక ఫెడరేషన్లు ఫిబ్రవరి 12 న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. కార్మిక హక్కులను దెబ్బతీసే 4 లేబర్ కోడులను రద్దు చేయాలని, కార్పొరేట్ల ప్రయోజనాల కోసం చిన్న పరిశ్రమలను దెబ్బతీసే విధానాలను విడనాడాలని, చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహాలు పెంచాలని, రైతుల పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని తదితర డిమాండ్ల సాధనకై ఈ సమ్మె జరుగుతుందని తెలియజేశారు. సమ్మెలో కార్మికులు, రైతులు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు జాన్, తెరేజమ్మ, శ్రీను, దేవరకొండ సాంబయ్య, శివ లీల తదితరులు పాల్గొన్నారు.

# మే 9న కామెడ్‌కె యుజిఇటి యూనిగేజ్ 2026 ప్రవేశ పరీక్ష

**విజయవాడ, జనవరి 9, ప్రభాతవార్త :** మే 9న నిర్వహించనున్న కామెడ్‌కె యుజిఇటి యూనిగేజ్ 2026 ప్రవేశ పరీక్షకు దరఖాస్తు తేది ఈ నెల 3 నుండి మార్చి 16 వరకు ఉంది. కర్ణాటకలోని 150కి పైగా ఇంజనీరింగ్ కళాశాలలు, భారతదేశమంతటా ఉన్న 30కి పైగా ప్రసిద్ధ ప్రైవేట్, స్వయం ప్రతిపత్తి గల డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో అండర్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ ప్రవేశాలకు ఈ జాతీయ స్థాయి ఏకీకృత పరీక్ష కీలకంగా వ్యవహరిస్తుంది. కర్ణాటక అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజెస్ అసోసియేషన్, యూనిగేజ్ సభ్యత్వ విశ్వవిద్యాలయాలకు అనుబంధంగా ఉన్న సంస్థలు అందించే బిఇ, బిటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం కోరుకునే అభ్యర్థుల కోసం ఈ పరీక్షను నిర్వహిస్తున్నారు. ఈ




కంప్యూటర్ ఆధారిత పరీక్ష భారతదేశంలోని 200 పైగా నగరాల్లో, 400లకు పైగా పరీక్షా కేంద్రాలలో జరుగనున్న ఈ పరీక్షకు 1,40,000 మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు.

# 12న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**దర్శి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** ఈనెల 12వ తేదీ దర్శిలో జరుగు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం దర్శి పట్టణంలోని గుజ్జుల సరళాదేవి భవన్లో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెల గోడ పత్రిమలను ఏఐటీయుసీ ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రకాశం జిల్లా ఏఐటీయుసీ ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గం ఏఐటీయుసీ ఉపాధ్యక్షులు జూపల్లి కోటేశ్వరరావు, దర్శి నియోజకవర్గం ఏఐటీయుసీ కార్యదర్శి హనుమంతరావు, దర్శి నియోజకవర్గం సీపీఐ పార్టీ ఇన్‌చార్జి రాచపూడి కరుణానిధి, జిల్లా నాయకులు సింగరకొండ శ్రీను, నాయకులు విజయ్. ఈ కార్యక్రమంలో ముట్ట వర్కర్ యూనియన్ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వేములూరుపాడు జడ్పీ విద్యార్థులు యంగ్ సైంటిస్ట్ అవార్డుకు ఎంపిక

**గుంటూరు విద్య ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** జిల్లా పరిషత్ వేములూరుపాడు ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు ఐర్ల జ్యోతిర్మయి, భీమనాదుని




అనుశ్రీ మరియు గైడ్ టీచర్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు వి ఎస్ రామాంజనేయులు ప్రతిష్టాత్మక డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం యంగ్ సైంటిస్ట్ అవార్డు అందుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్ సాంబయ్య తెలిపారు. వీరికి డెమోక్రటిక్ పిఆర్టీయు ఉపాధ్యాయ సంఘం, జాతీయ సేవాదళ్ ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం రీసెర్చ్ ఫౌండేషన్ న్యూఢిల్లీ సౌజన్యంతో విజయవాడలో అవార్డు ప్రధానోత్సవం జరిగింది. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారు నిర్వహించిన జిజ్ఞాస సైన్స్ ఎగ్జిబిషన్లో జాతీయస్థాయికి ఎంపికై ఈ నెల 16న పూణేలో జరిగే సైన్స్ ఎక్స్పోకు ఎంపికైన విద్యార్థులు జ్యోతిర్మయి అనుశ్రీ మరియు గైడ్ టీచర్ ఎస్ రామాంజనేయులను కేజీవీపీ స్కూల్ సెక్రెటరీ దేవానంద్ రెడ్డి చే సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య ఉపాధ్యాయులు రాజు, ప్రమీల మరియు ఉపాధ్యాయ సిబ్బంది గ్రామ పెద్దలు విద్యార్థులను అభినందించారు.

# యల్‌బిఆర్‌సిఇ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో రెండు రోజుల వర్క్‌షాప్

**మైలవరం, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఎస్సెంటిల్స్ అఫ్ జావా అండ్ పైథాన్"అంశంపై సోమ, మంగళవార రెండు రోజుల వర్క్షాప్ ను నిర్వహించుచున్నారు. ఈ వర్క్‌షాప్‌లో జావా, పైథాన్ ప్రోగ్రామింగ్ భాషల ప్రాథమిక అంశాలు, ఆబ్జెక్ట్ ఓరియెంటెడ్ ప్రోగ్రామింగ్ కాన్సెప్ట్, రియల్ టైమ్ అప్లికేషన్లలో జావాపైథాన్ ఉపయోగాలు, సాఫ్ట్వేర్ పరిశ్రమలో అవసరమైన ప్రోగ్రామింగ్ నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన



కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రాడ్స కీ టెక్నాలజీస్ చెన్నై నందు అకాడమిక్ డైరెక్టర్ టెక్నికల్ ట్రైనర్ డా సందర్ రాజన్, సీనియర్ టెక్నికల్ లీడ్ శ్రీకాంత్ విద్యార్థులకు ప్రాక్టికల్ డెమోస్తో పాటు హ్యాండ్స్ ఆన్ సెషన్స్ నిర్వహించి, కోడింగ్ నైపుణ్యాలను మెరుగుపరుచుకునే విధంగా మార్గనిర్దేశం చేశారు. ఈ రెండు రోజుల వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులు ఆధునిక సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో కీలకమైన జావా మరియు పైథాన్ భాషలపై మెరుగైన అవగాహనను, భవిష్యత్ ఉద్యోగావకాశాలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కళాశాల విభాగాధిపతి డా.డి.రత్న కిషోర్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సి పాల్ డా.కె.అప్పారావు ఐటీ విభాగాధిపతి డా డి. రత్నకిషోర్, విభాగ ప్రొఫెసర్స్ డా.యస్ నాగాంజనేయులు, డా.బి.శ్రీనివాస రావు పాల్గొన్నారు. ఈ వర్క్షాప్‌కు ఐటీ విభాగ సీనియర్ అధ్యాపకులు ఎం. రాజేష్ రెడ్డి, వి. వి కృష్ణా రెడ్డి కో ఆర్డినేటర్లు గా వ్యవహరించారు.

# పావులూరి శ్రీనివాసులు మృతి బాధాకరం

## - టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి

**హనుమంతునిపాడు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** హనుమంతునిపాడు మండలం లింగంగుంట్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పావులూరి శ్రీనివాసులు(50) గుండెపోటుతో మరణించడం చాలా బాధాకరమని టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. శ్రీనివాసులు మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే తిరుపతిరెడ్డి అక్కడికి చేరుకుని శ్రీనివాసులు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు చీకటి వెంకట సుబ్బయ్య, మండల యూనిట్ ఇన్‌చార్జి దేవిరెడ్డి రాజారెడ్డి, లింగంగుంట్ల ఎఫ్ఏ తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గోద్రేజ్ ఆగ్రోవెట్ టకాయ్ మార్కెట్లోకి విడుదల

**విజయవాడ, జనవరి 9, ప్రభాతవార్త :** గోద్రేజ్ ఆగ్రోవెట్ సరికొత్త కీటక నాశని టకాయ్ భారతదేశంలో వైవిధ్యభరితమైన వాతావరంలో వరి సాగు చేసిన రైతుల ప్రయోజనాల కోసం జపాన్‌కు చెందిన ఐఎస్కె సంస్థ సైక్లాప్రిన్ టీహెచ్ఎం టెక్నాలజీతో రూపొందించగా, వరితోపాటు మొక్కజొన్న, మిరప, క్యాబేజీ, సోయాబీన్, శనగ, చెరుకు పంటలలో ప్రధానంగా కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పరుగులను నాశనం చేయడంలో ఇది అత్యంత ప్రభావవంతంగా పని చేసే టకాయ్'ని తమ సంస్థ అందుబాటులోకి తెచ్చిందని గోద్రేజ్ ఆగ్రోవెట్ క్రాప్ ప్రొడక్షన్ బిజినెస్ సీఈవో ఎస్ కె రాజవేలు తెలిపారు.-ార్యక్రమంలో జోనల్ హెడ్ మధు, అసిస్టెంట్ మేనేజర్ మురళి మోహన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఐపిఒ బలోపేతానికి ఎన్ఎస్ఇ బోర్డు నిర్ణయాలు

**విజయవాడ, జనవరి 9, ప్రభాతవార్త :** లిస్టింగ్ విధాన క్రమాన్ని పర్య వేక్షించి, నడిపించడానికిగాను ప్రత్యేంగా ఐపిఒ కమిటీని తిరిగి నియమించడం ద్వారా ఎన్ఎస్ఇ తన ఐపిఒ పాలనా చట్రాన్ని బలోపేతం చేస్తూ టాబ్లేష్ పాండే ఛైర్ పర్సన్, (నాన్ ఇండిపెండెంట్ డైరెక్టర్), పబ్లిక్ ఇంటరెస్ట్ డైరెక్టర్లు శ్రీనివాస్ ఇంజెటి సభ్యులు, ప్రొఫెసర్ డా.మమతా బిస్వాల్ సభ్యులు, రిటైర్డ్ జస్టిస్ అభిలాష కుమారి సభ్యులు, ప్రొఫెసర్. జి. శివకుమార్ సభ్యులు, ఆశీష్ కుమార్ చౌహాన్ సభ్యులు (ఎండి, సిఇఒ)లుగా నియామకాలు జరిగాయి. బొగ్గు వినిమయం కోసం పూర్తి యాజమాన్యంలో వుండే అనుబంధ సంస్థ ఏర్పాటుకు ఎన్ఎస్ఇ బోర్డు అనుమతించింది, ఇది నియంత్రణా సంస్థల అనుమతులు పొందాల్సి వుంటుంది. ఈ ప్రతిపాదిత అనుబంధ సంస్థకు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ అనుమతించినట్టుగా నేషనల్ కోల్ ఎక్స్చేంజ్ / భారత్ కోల్ ఎక్స్చేంజ్ / ఇండియా కోల్ ఎక్స్చేంజ్ అని పేరు పెట్టవచ్చునని బోర్డు తెలిపింది.

# ముత్తూట్ ఫిన్ కార్ప్ లిమిటెడ్‌తో హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ ఎంఓయూ

**విజయవాడ, జనవరి 9, ప్రభాతవార్త :** భారతదేశంలోని ప్రముఖ జీవిత బీమా కంపెనీ హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ కేరళలోని తిరువనంతపురంలో ప్రధాన కార్యాలయం కలిగిన ముత్తూట్ పప్పచన్ గ్రూప్ (ముత్తూట్ బ్లూ) ప్రధాన సంస్థ అయిన ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది.ఈ భాగస్వామ్యంతో ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్ కస్టమర్లు హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ యొక్క సమగ్రమైన గ్రూప్ మరియు వ్యక్తిగత జీవిత బీమా పరిష్కారాలను యాక్సెస్ చేయడానికి వీలు కలుగుతుందని హెచ్డీఎఫ్సీ లైఫ్ డైరెక్టర్ విభా పడాల్కర్ తెలిపారు.

# 3డి ప్రింటింగ్‌కి మొట్టమొదటి అల్ట్రాస్ట్రాంగ్ కాంపోజిట్ మెటీరియల్

**విజయవాడ, జనవరి 9, ప్రభాతవార్త :** ప్రముఖ ప్రపంచ అల్యూమినియం ఉత్పత్తిదారైన రుసల్, 3డి ప్రింటింగ్ కోసం కాంపోజిట్ మెటీరియల్‌లో ఒక పురోగతిని ఆవిష్కరించి, కొత్త మెటల్ మ్యాట్రిక్స్ కాంపోజిట్ నియమించబడిన ఆర్ఎస్-770కె బలమైన అల్యూమినియం పౌడర్ మిశ్రమాల కంటే 30% ఎక్కువ తన్యత బలాన్ని అందిస్తుంది, ఇంట్లోనే అభివృద్ధి చేయబడిన ఆర్ఎస్-770కె మిశ్రమ అల్యూమినియం మాతృకను సిరామిక్ కణాలతో కలిపి, 615 మెగాపాస్కల్స్ యొక్క అద్భుతమైన తన్యత బలాన్ని సాధిస్తుంది. ఇది రుసల్ యొక్క పోర్ట్‌ఫోలియోలో బలమైన అల్యూమినియం పౌడర్ మిశ్రమమైన ఆర్ఎస్-553 మిశ్రమం కంటే 30 పెరుగుదలను సూచిస్తుంది,

# కనిగిరి మాజీ సైనికుల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**కనిగిరి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** కనిగిరి నియోజకవర్గంలోని మాజీ సైనికుల నూతన కార్యవర్గ కమిటీ ఎన్నిక సోమవారం కనిగిరి పట్టణంలోని స్థానిక రోటరీ క్లబ్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాజీ సైనికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా వింగ్ కమాండర్ కొండలరావు, ఉపాధ్యక్షుడిగా కే.వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శులుగా ఓ.సత్యనారాయణ, జి.ప్రతాపరెడ్డి, కోశాధికారిగా చెన్నకేశవులు, కో- ఆర్డినేటర్ సభ్యుడిగా ఆర్.రమేష్, సాంస్కృతిక సభ్యుడిగా కోమటిగుండ్ల బాబురావు ఎన్నికయ్యారు. అలాగే ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా బి.కొండలరావు, ఆనందరావు, జి.సుదర్శన్, పీవీఆర్ రెడ్డి తదితరులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు వింగ్ సీడీఆర్ కొండలరావు మాట్లాడుతూ దేశ రక్షణలో ప్రాణాలకు తెగించి సేవలందించిన మాజీ సైనికులు, వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ ఫలాలు సకాలంలో అందేలా కృషి చేస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ సైనికులు పాల్గొన్నారు.

# నయన మనోహరంగా శ్రీవారి పుష్పయాగం

## - భక్తిప్రపత్తులతో పురవీధుల్లో శోభయాత్ర -కనులవిందుగా కోలాట ప్రదర్శనలు

**బాపట్ల, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** పట్టణంలోని కోన కళాక్షేత్రంలో శ్రీ లలితా త్రిపుర సుందరీ పీఠం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం శ్రీవారి



పుష్పయాగ మహోత్సవం కనులపండువగా జరిగింది. భక్తిశ్రద్ధలు, వేద మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించిన ఈ వేడుకను చూసేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. శోభయాత్ర కార్యక్రమంలో భాగంగా ముందుగా నిర్వహించిన పుష్పయాగ శోభయాత్ర ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శ్రీ సీతారామ కోలాట సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాట ప్రదర్శనలు, భక్తుల గోవింద నామస్మరణలతో పురవీధులన్నీ మార్మోగిపోయాయి. డప్పు వాయిద్యాలు, నాదస్వరం మధ్య ఊరేగింపు వైభవంగా సాగింది. అనంతరం రాత్రి శ్రీవారి పుష్పయాగ మహోత్సవం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. నెమలికంటి హనుమంతరావు సారథ్యంలో, ప్రముఖ పండితులు శ్రీమాన్ ముత్తేవి శ్రీనివాస శశికాంత్ యాగ్నీక పర్యవేక్షణలో అర్చక బృందం ఈ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. రొంపిచర్ల కేశవాచార్యులు, పరాశరం రఘురామ్, గోపాలాచార్యులు, కౌండిన్య, సాయి వెంకట్, ప్రసాద్ స్వామి విఖనస మూర్తి, మణికంఠ తదితరులు వేదపారాయణ చేస్తూ పూజా కార్యక్రమాలను పూర్తి చేశారు. ఈ వేడుకలో బండి రాంబాబు, కృష్ణ గౌడ్ బాలాజీ, అంజిరెడ్డి, నాళం శ్రీను, సుదర్శన్, రాజు గారితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. నాదస్వరం, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చివరగా భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టారు

# రహదారుల నిర్మాణానికి రూ.10.67కోట్లు మంజూరు

## ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, ఫిబ్రవరి 9,ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి, మరమ్మత్తులకు రూ.10.67కోట్లు నిధులు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమన్నారు. పొన్నూరు నియోజకవర్గంలోని పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని మండల్లో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రూ.10.67కోటల అంచనా వ్యయంతో ఐదు ముఖ్యమైన రోడ్ల అభివృద్ధి పనులకు మంజూరు లభించిందన్నారు. పొన్నూరు మండలంలో జీబీసీ రోడ్డు నుండి పివి రోడ్డు వరకు(వయా దొప్పలపూడి, మన్నవ)5.112కి.మీ, అంచనా వ్యయం



రూ.2.94కోట్లు, పొన్నూరు-చందోలు ఆర్‌అండ్‌బి రోడ్డు నుండి కోమలి వరకు(వయా జడవల్లి) 2.17కి.మీ. అంచనా వ్యయం రూ.1.33కోట్లు, చేబ్రోలు మండలంలో కొలకలూరు ఆర్‌అండ్‌బి రోడ్డు నుండి(వయా శేకూరు) నుండి అనుమర్లపూడి వరకు 6.673కి.మీ.అంచనా వ్యయం రూ.4.01కోట్లు, మంచాల నుండి తోట్లపాలెం వరకు 1.720కి.మీ. అంచనా వ్యయం రూ.1.80కోట్లు, పెదకాకాని మండలంలో గుంటూరు-హనుమాన్‌పాలెం ఆర్‌అండ్‌బి రోడ్డు నుండి రామచంద్రాపురం వరకు 1.720కి.మీ. అంచనా వ్యయం రూ.0.59కోట్లు మంజూరు అయ్యాయన్నారు. ఈ రహదారులు పూర్తియితే గ్రామీణ ప్రాంతాల వారికి రాకపోకలు నిర్వహించేందుకు సులువుగా ఉంటుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం వల్లే ఈ నిధులు రాబట్టుకోగలిగామన్నారు. రానున్న రోజుల్లో కూడా నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానని, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి నిధులు రాబడతానన్నారు.

# వందేమాతరం పట్ల ప్రతి ఒక్కరు దేశభక్తి భావాన్ని కలిగి ఉండాలి : తాహశీల్దార్ సిహెచ్ పద్మావతి

**చెరుకుపల్లి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** దేశం పట్ల, జాతీయ గీతాల పట్ల ప్రతి ఒక్కరు భక్తి భావాలను పెంపొందించుకోవాలని తాసిల్దార్ సిహెచ్ పద్మావతి అన్నారు. వందేమాతరం జాతీయగీతం ఆమోదించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ర్యాలీ కార్యక్రమం సోమవారం చెరుకుపల్లి మండలంలో తాసిల్దార్ సిహెచ్ పద్మావతి ఆధ్వర్యంలో అధికారులు, మండల స్థాయి నాయకులు ఘన స్వాగతం పలికారు. 130 మంది సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ సభ్యులు నెలరోజులపాటు దేశవ్యాప్తంగా ఈ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ర్యాలీ నిర్వాహక అధికారులు తెలిపారు. జనవరి 28వ తేదీన పశ్చిమబెంగాల్ బకాలి బీచ్ నుండి కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ ఆధ్వర్యంలో ప్రారంభమైందని అసిస్టెంట్ కమాండెంట్ సిద్ధార్థ గోస్వామి తెలిపారు. 130 మంది సిఐఎస్ఎఫ్ సభ్యులు రెండు విభాగాలుగా ఈస్ట్ కోస్ట్ , వెస్ట్ కోస్ట్ ప్రాంతాల్లో ఈ ర్యాలీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ర్యాలీ ప్రధాన ఉద్దేశం సముద్ర తీరం వెంబడి స్మగ్లింగ్ మరియు చొరబాటు దారులను స్థానికులకు అవగాహన కల్పించి అరికట్టడం అన్నారు. ఈస్ట్ కోస్ట్ ర్యాలీలో 30 మంది మహిళలు 35 మంది పురుషులతో కేరళలోని వచ్చింది వరకు 6,511 కిలోమీటర్లు పొడవునా వందేమాతర ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మరో అసిస్టెంట్ కమాండెంట్ లలిత్ తెలిపారు. అదేవిధంగా మత్స్యకారులకు ఈ ర్యాలీ ద్వారా అవగాహన కల్పించి వారి నుండి దేశ భద్రత విభాగమైన సెంట్రల్ ఆర్మ్డ్ ఫోర్సు జాయిన్ అయ్యేవిధంగా ప్రభుత్వం తగిన అవకాశాలు కల్పిస్తుందని తెలియపరుస్తున్నామని మరో అసిస్టెంట్ కమాండెంట్ గుప్తా తెలిపారు. ర్యాలీ పర్యవేక్షణ డిప్యూటీ కమాండర్ హర్షబ్ డెవాంగ్ పర్యవేక్షి



ంచారు. ర్యాలీ సభ్యులందరికీ తాసిల్దార్ ఆధ్వర్యంలో డీసీ చైర్మన్ ఎంఆర్కె మూర్తి, రాచంశెట్టి నాగాంజనేయులు భోజన వసతి కార్యక్రమాలను ఘనంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బాపట్లపార్లమెంటరీ ఆర్గనైజ్డ్ సెక్రటరీ మల్లాది రామకృష్ణ, రాష్ట్ర నాయకులు దివి రాంబాబు, కొనకాల రవి కిరణ్,సొంటి సుబ్బయ్య, విశ్వంశెట్టి శీను, మండలంలోని శాఖల అధికారులు ,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సత్యసాయి అఖండ జ్యోతి యాత్రకు భక్తిశ్రద్ధలతో స్వాగతం

**పొన్నూరు, ఫిబ్రవరి 9,ప్రభాతవార్త:** శ్రీ సత్యసాయి బాబా శతాబ్ది ఉత్సవాలలో భాగంగా శ్రీ సత్యసాయి అఖండ జ్యోతి యాత్ర రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు, అన్ని మందిరాలకు తీసుకెళుతున్నారు. అందులో భాగంగా



సోమవారం శ్రీ సత్యసాయి అఖండ జ్యోతి యాత్ర స్వర్ణపురి పట్టణంలోని శ్రీ సత్యసాయి మందిరానికి వేంచేపు చేశారు. ఇక్కడి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో జ్యోతికి నారికేళాలు సమర్పించి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. ఈ జ్యోతిని భక్తులు జ్ఞాన, ప్రేమ జ్యోతిగా భావిస్తారని శ్రీ సత్యసాయి మందిరం నిర్వాహకులు బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ జ్యోతి నిరంతరం వెలుగుతూ భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, సాయి సందేశాన్ని ప్రచారం చేయడానికి ఉద్దేశించినట్లు చెప్పారు. ఇది శ్రీ సత్యసాయి బాబా ఆశీస్సులతో, భక్తులచే నిర్వహించబడే ఒక ఆధ్యాత్మిక కార్యక్రమమన్నారు.ఈ జ్యోతి వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ భక్తులను ఆధ్యాత్మికంగా ఏకం చేస్తుందన్నారు. భక్తుల సందర్శనార్థం ఈ జ్యోతిని కొన్ని గంటలపాటు మందిరంలో ఉంచారు. అనంతరం ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు చేరుతుందన్నారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జ్యోతికి నమస్కరించి మొక్కులు తీర్చుకున్నారు.

# డిఎస్పీగా ఎంపికైన ఓంకార వెంకట నాగేశ్వరరావుకు సత్కారం

**కొల్లిపర, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** ండలంలోని అత్తోట గ్రామ పంచాయతీ కార్యాలయం ఇన్‌ఛార్జి సెక్రటరీగా పనిచేస్తున్న అడపాల ఓంకార వెంకట నాగేశ్వరరావు ఇటీవల జరిగిన గ్రూప్-1 పరీక్షలలో డిఎస్పీ ఉద్యోగానికి ఎంపిక య్యారు. దీంతో సోమవారం ప్రజా ప్రతినిధులు,గ్రామస్తులు తమ గ్రామంలో ఘనంగా సత్కరించారు.మొదటి నుంచి ఓంకార వెంకట నాగేశ్వరరావు విద్యలో ఉన్నత ప్రతిభ కనబరుస్తూ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి అంతటితో సంతృప్తి చెందకుండా గ్రూప్-1 పరీక్షలలో పట్టుదల,లక్ష్యంతో ఉత్తీర్ణత సాధించి డిఎస్పీగా ఎంపికకావడం సంతోష దాయకమని,అత్తోట గ్రామానికి గర్వ



కారణమని పలువురు కొనియాడారు.ఈ ఉద్యోగం చేస్తూ డిఎస్పీ ఉద్యోగానికి ఎంపికైన ఓంకార వెంకట నాగేశ్వరరావుకు ఎల్లప్పుడూ భగవంతుని ఆశీస్సులు తోడుగా ఉండాలని,ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరుతూ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఓంకార వెంకట నాగేశ్వరరావు దంపతులను కార్యక్రమంలో సర్పంచ్ దేశబోయిన నాగపుణేశ్వరరావు,ఉపసర్పంచ్ దివ్వేల ఏడుకొండలు,నాయకులు యర్రు వెంకయ్యనాయుడు,తన్నీరు శంకరరావు, యర్రు శ్రీనివాసరావు, నారాయణ, రాజగోపాలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్‌కు ఆరు అర్జీలు

## ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు

**పొన్నూరు, ఫిబ్రవరి 9,ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)కు వివిధ సమస్యలకు సంబంధించి ఆరు అర్జీలు అందినట్లు ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు తెలిపారు. అందులో గృహ నిర్మాణశాఖకు



సంబంధించి-1అర్జీ, రెవెన్యూకు సంబంధించి ఐదు అర్జీలు అందినట్లు తెలిపారు. వీటిని పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ పేరాల దుర్గారావు, మండల వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, డిప్యూటీ ఎంపిడిఓ వేముల శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాజకీయ లబ్ధి కోసం భక్తుల మనోభావాలను దెబ్బతీయెద్దు

## హైకోర్టు అడ్వకేట్ కొసనం శ్రీనివాసరావు

**మంగళగిరి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** ప్రపంచంలో అతి పవిత్రమైన పుణ్య క్షేత్రాల్లో ఒకటైన తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల క్రొవ్వు కలవ లేదంటూ సిట్ స్పష్టమైన నివేదిక ఇచ్చినప్పటికీ కూటమి పార్టీలు కేవలం రాజకీయ లబ్ధి కోసమే తప్పుడు ప్రచారాన్ని ఆపడం



లేదని ప్రముఖ హైకోర్టు న్యాయవాది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హిందూ జన చైతన్య సమితి అధ్యక్షుడు కొసనం శ్రీనివాసరావు విమర్శించారు. ఈ మేరకు ఆయన సోమవారం సాయంత్రం మంగళగిరి పట్టణంలోని ప్రెస్ క్లబ్ నందు విలేకరుల సమావేశాన్ని నిర్వహించి కూటమి పార్టీల తీరుపై మండిపడ్డారు. కొసనం శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాజకీయంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని అప్రతిష్ట పాలు చేయాలనే కుట్రతో కూటమి నాయకులు తిరుపతి లడ్డు ప్రసాదంలో కల్తీ చోటు చేసుకుందంటూ విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి క్రైస్తవుడని ఈ క్రమంలో హిందూ దేవాలయాల్లో లభ్యమయ్యే ప్రసాదాల్లో కల్తీ చేస్తాడనే ప్రచారం ద్వారా హిందువుల ఓటు బ్యాంకు ను తమ వైపు తిప్పుకునేందుకే ఇటువంటి దారుణమైన కుట్రకు తెర లేపారని ఆరోపించారు. కల్తీ ఎప్పుడు జరిగింది ?ఎలా జరిగింది? ఎవరు చెప్పారు? అనేది మాత్రం కూటమి ముఖ్య నాయకులు స్పష్టం చేయలేకపోయారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జంతువుల క్రొవ్వు, చేప నూనె ద్వారా తయారుచేసిన నెయ్యితో లడ్డూలను తయారు చేశారని దుష్ప్రచారం చేశారని అన్నారు. సుప్రీంకోర్టు జోక్యం తో దర్యాప్తులో సిబిఐ ని కూడా భాగస్వామిని చేశారని తెలిపారు. తిరుపతి లడ్డు ప్రసాదంలో జంతువుల క్రొవ్వు కలవలేదని సిట్ స్పష్టమైన నివేదిక ఇచ్చిందని తెలిపారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం కల్తీ జరిగిందనే తప్పుడు ప్రచారం ఇప్పటికీ కొనసాగిస్తుందని మండిపడ్డారు. 58 లక్షల టన్నుల పామాయిల్ లో లక్ష టన్నులు కెమికల్స్ కలిపి 59 లక్షల టన్నుల నెయ్యితో కల్తీ నెయ్యి తయారు చేశారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అసలు కల్తీ ఎలా జరిగింది.. నెయ్యిలో కలిసినటువంటి కెమికల్స్ పేర్లేమిటి.... ఎన్ని యూనిట్లు ఎక్కడ కలిపారు? మాన్యువల్ గా ఎంత తయారు చేశారు.... యంత్రాలతో ఎంత తయారు చేశారు... అన్నదానిపై స్పష్టత లేకుండా ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. త్వరలో ఈ అంశంపై హైకోర్టులో తాను న్యాయవాదిగా ప్రశ్నలను సంధిస్తానని తెలిపారు. కల్తీ నెయ్యిని గుర్తించినప్పుడు ఎక్కడ సీజ్ చేశారు సీట్ చేసిన నెయ్యిని ఎక్కడికి పంపారు... అన్నదానికి కూడా జవాబు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం మతపరమైన వ్యతిరేకతను తెచ్చేందుకే జగన్ పై అర్థరహితమైన ఆరోపణలు చేస్తున్నారని ఇది ప్రజలకు అర్థమయిపోయిందని అన్నారు. పైగా శ్రీశైలం ప్రసాదంలో కూడా కల్తీ జరిగిందంటూ ప్రస్తుతం తప్పుడు ప్రచారాలను తెరపైకి తెస్తున్నారని అన్నారు. ఏమి చేయాలో అర్థం కాక బాత్రూంలు శుభ్రపరిచే కెమికల్స్ నెయ్యిలో కలిపారంటూ ఈ కోణంలో విచారించాలని అనటం దారుణమని మండి పడ్డారు. ఏ అంశాల ఆధారంగా చంద్రబాబు ఆరోపిస్తున్నారు చెప్పాలని ప్రశ్నించారు. పవిత్రమైన తిరుపతి లడ్డును ఎందరో కోట్లాదిమంది భక్తులు స్వీకరిస్తారని ఈ క్రమంలో ఈ విధంగా తప్పుడు ఆరోపణలు చేయటం వారిలో అపోహలని రేకెత్తించడమేనని అన్నారు.

నిరాధారమైన ఆరోపణలతో హిందువుల మనోభావాలను దెబ్బతీయటం సరికాదని తెలిపారు. ఇప్పటికైనా రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేసే విధానానికి ముగింపు పలకాలన్నారు. కల్తీ నెయ్యి అంశాన్ని హైకోర్టు సుమోటోగా తీసుకొని విచ్చరించాలని లేదంటే తానే రిట్ పిటీషన్ వేస్తానని ఆయన తెల్చి చెప్పారు.

# గర్భిణీలు ఆరోగ్య సూత్రాలను పాటించాలి

**కొల్లిపర, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** ఆరోగ్య సూత్రాలను గర్భిణీలు విధిగా పాటించాలని మండల వైద్యాధికారి నీహ అన్నారు. సోమవారం మండలంలోని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి మాతృ వందన సురక్షా యోజన కార్యక్రమంలో భాగంగా గర్భిణీలు, బాలింతలకు వైద్య పరీక్షలు



నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు.డాక్టర్ నీహ మాట్లాడుతూ ప్రతి నెలా గర్భిణీలు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలని ఆమె సూచించారు. వైద్యుల సలహాలు,సూచనల ప్రకారం మందులను వాడుకోవాలని చెప్పారు.బాలింతలు తగిన సమయంలో తమ పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నాగరాజు, పిహెచ్ఎన్ సుమతి,ఎఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

## -ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.రుక్మిణి

**పొన్నూరు, ఫిబ్రవరి 9,ప్రభాతవార్త:** రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకునేందుకు వీలుగా న్యాయశాఖ ఆధ్వర్యంలో మార్చి 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు న్యాయవాదులు కృషి



చేయాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.రుక్మిణి కోరారు. స్థానిక కోర్టు కార్యాలయంలో సోమవారం బార్ అసోసియేషన్ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బార్ అసోసియేషన్ సభ్యులు తమ వంతు సహాయ సహకారాలు అందించి సహకరించాలని కోరారు. లోక్ అదాలత్ గురించి కక్షిదారుల్లో అవగాహన కలి ్పంచాలని కోరారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజిసాహెబ్, న్యాయవాదులు మగ్బుల్‌బేగ్, ఎంహెచ్ఎస్ సాయిబాబు, బాషా, సాయిదుర్గా, యాసిన్ అహమ్మద్ తదితరులున్నారు.

# ఒకసారి పక్షవాతం వచ్చిన వారికీ మళ్లీ వచ్చే అవకాశం ఉంటుంది

**గుంటూరు వెస్ట్, ఫిబ్రవరి 9,ప్రభాతవార్త:** ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన అధ్యక్షురాలు ప్రముఖ న్యూరాలజిస్ట్ డా. పి. విజయ, ఫిబ్రవరి 4,6 తేదీలలో అమెరికాలోని న్యూ ఆర్లియన్స్, లూసియానాలో ఎర్నెస్ట్ ఎన్. మోరియల్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించిన ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ స్ట్రోక్ కాన్ఫరెన్స్ 2026లో భారతదేశం తరుపున ప్రాతినిధ్యం వహించారు. అమెరికన్ స్ట్రోక్ అసోసియేషన్ మరియు ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన జాయింట్ సింపోసియం నందు డా. విజయ ఆతిధ్య స్పీకర్ గా పాల్గొని అంశం పై మాట్లాడారు. ఒకసారి పక్షవాతం వచ్చిన వారికీ మళ్లీ వచ్చే అవకాశం సుమారు 20 వరకు ఉందని డా విజయ తెలిపారు. రక్తాన్ని పలుచన చేసే మందులు ఆపివేయడం, రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ సరైన నియంత్రణలో లేకపోవడం, మరియు అనారోగ్యకరమైన జీవనశైలి కారణంగా పక్షవాతం మళ్లీ సంభవిస్తుందని తెలిపారు. పక్షవాతం నుండి కోలుకున్న రోగులు జీవితాంతం చికిత్స మరియు న్యూరాలజిస్ట్ పర్యవేక్షణ అవసరమని డా. విజయ ప్రత్యేకంగా వివరించారు. ఇంకా ఈ సమావేశంలో నరాల జబ్బులు వైద్య విధానాన్ని ప్రభావితం చేసిన అనేక ముఖ్యమైన పరిశోధన పత్రాలు సమర్పించ బడ్డాయి చిన్న పిల్లల్లో వచ్చే తీవ్రమైన పక్షవాతాలకి కూడా మెకానికల్ థ్రోంబెక్టమీ వంటి ఎండోవాస్క్యూలర్ చికిత్సల ద్వారా ఫలితం ఉంటుందన్నారు. ఐ వి థ్రోంబోలైసిస్: ఎంపిక చేసిన రోగుల్లో ఆధునికయమ్ ఆర్ ఐ సాంకేతికతల

**ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన అధ్యక్షురాలు ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి విజయ.**



సహాయంతో లక్షణాలు ప్రారంభమైన తరువాత 9గంటల వరకు క్లాట్ను కరిగించే మందులు సురక్షితంగా ఇవ్వవచ్చు. పక్షవాత లక్షణాలు కనవడిన పేషంట్లని ముందస్తు సమాచారం ఇచ్చి స్ట్రోక్ అంబులెన్స్ లో వేగంగా అధునాతన స్ట్రోక్ సెంటర్లకు తరలించాలని సిఫారసు చేశారు ఎందుకంటే పక్షవాతంలో ప్రతి నిమిషం విలువైనది.ఈ ఏడాది ఐఎస్ఈ 2026 సమావేశానికి ఆసియా, యూరప్, ఆఫ్రికా, అమెరికాస్, ఓషియానియా మరియు మిడిల్ ఈస్ట్ ప్రాంతాల నుండి 70కు పైగా దేశాలకు చెందిన 5,000 మందికి పైగా ప్రతినిధులు హాజ రయ్యారు. వీరిలో న్యూరాలజిస్టులు, స్ట్రోక్ శాస్త్రవేత్తలు, పునరావాస నిపుణులు, నర్సులు, అనుబంధ ఆరోగ్య సిబ్బంది, పరిశోధకులు, విధాన నిర్ణేతలు మరియు ప్రజారోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా స్ట్రోక్ పరిశోధన మరియు చికిత్సలో సమగ్ర సహకారాన్ని ప్రతిబింబిస్తుందని డాక్టర్ విజయ తెలిపారు.

# రోటరీ ఆధ్వర్యంలో సర్వికల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్

**గుంటూరు విద్య ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** స్థానిక రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో ఆది సోమవారాల్లో సర్వికల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ కార్యక్రమం జరిగింది. సుమారు 150 మంది విద్యార్థును లకు లక్ష రూపాయలు విలువగల వ్యాక్సినేషన్ను అందించారు. రోటరీ 3150 డిస్ట్రిక్ట్ పూర్వ గవర్నర్ వడ్లమాను రవి ముఖ్య అతిథిగా విచ్చేసి మొదటి వ్యాక్సిన్ వేశారు .ఈ కార్యక్రమం రిత్విక్ హాస్పిటల్ సౌజన్యంతో డాక్టర్ రాజేంద్రప్రసాద్



ఆధ్వర్యంలో జరిగింది. ఈ వ్యాక్సినేషన్ శిబిరంను క్లబ్బు అధ్యక్షులు రోటోరియన్ నంబూరి కృష్ణమూర్తి ,కార్యదర్శి కే రవి కిరణ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన రోటోరియన్లు అనిల్ హరినాథ్ కా ,చంద్రశేఖరన్, సిహెచ్. రఘురాం, ఎం.వి సాంబశివరావు, పూర్వ అధ్యక్షులు కాలేషావలికు క్లబ్బు అధ్యక్షులు ఎన్. కృష్ణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

# వీరాస్వామి మృతికి సంతాపం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఫిబ్రవరి9, ప్రభాతవార్త:** ఏఎన్‌యులో టైం స్కేల్ ఎన్ఎంఆర్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న వీరాస్వామి మృతికి వర్సిటీ నివాళులు అర్పించింది. సోమవారం పరిపాలనా భవనంలో వీరాస్వామి ఫోటోకు వీసి ఆచార్య



కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీసి మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి ఆరోగ్యంపై శ్రద్దపెట్టాలని కోరారు. కుటంబ పెద్దను కోల్పోయిన వారిని ఓదార్చడం ఎంతో కష్టతరమన్నారు. వీరాస్వామి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంలో వికాస అధ్యక్ష కార్యదర్శులు ఎన్.ప్రసాద్, జె.శ్రీను, నూతక్కి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కె.భానుప్రసాద్, టైంస్కేల్ ఉద్యోగులు జేమ్స్ తదితరులు వీరాస్వామితో వారికున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

# సమ్మెలో విధిగా కార్మికులు,ఉద్యోగులు పాల్గొనాలి

**కొల్లిపర, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** ఈ నెల 12వ తేదీ జరిగే సార్వత్రిక సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు, యానిమేటర్లు,సాక్షరభారతి ఉద్యోగులు,



అంగన్‌వాడీ,ఆశా కార్యకర్తలు,పంచాయతీ ఉద్యోగులు పాల్గొంటారని సోమవారం కొల్లిపర ఎంపిడివో విజయలక్ష్మికి సిఐటియు జిల్లా,మండల స్థాయి నాయకులు వినతిపత్రం సమర్పించారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.3 వేల జీతం ఏ విధంగా సరిపోతుందని జిల్లా నాయకుడు ములకా శివ సాంబిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.ఉద్యోగులను స్కీం వర్కర్లుగా గుర్తించమని ప్రభుత్వాన్ని కోరుతున్నా స్పందన లేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసే పథకాలు ఉద్యోగులకు లభించడం లేదంటే వీరిని ఉద్యోగులుగా చూపిస్తున్న ప్రభుత్వం వీరి సంక్షేమాన్ని విస్మరించిందన్నారు.కార్మిక వర్గానికి ఉరితాడుగా మారుతున్న లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.2025 విత్తన చట్టం రద్దు చేయాలన్నారు.ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని ఆయన తెలిపారు. సిఐటియు మండల కన్వీనర్ ఎం.జయప్రద మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.అంగన్‌వాడీ మండల అధ్యక్షురాలు నిర్మల జ్యోతి మాట్లాడుతూ 12వ తేదీ ఉదయం 9.30 గంటలకు కొల్లిపరలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కార్మిక కర్షక ప్రదర్శన జరుగుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దండ లక్ష్మీనారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రమణ, జి.సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త కార్మికసమ్మెలో పాల్గొనండి

## ప్రజాసంఘాల నాయకులు పిలుపు

**తెనాలి టౌన్ ఫిబ్రవరి9(ప్రభాతవార్త):** ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త కార్మికసమ్మెలో ప్రతిఒక్క కార్మికుడూ పాల్గొని సమ్మెకు మద్దతునివ్వాలని తెనాలి డివిజన్,సిఐటీయు ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు.సోమవారం పట్టణంలోని చినరావూరు



ప్రాంతంలో,మున్సిపల్ పారిశుధ్య కార్మికులను సీఐటీయూ తెనాలి డివిజన్ కార్యదర్శి షేక్.హుస్సేన్ వలి కార్మికుల ఉద్దేశించి మాట్లాడారు. ఫిబ్రవరి 12సార్వత్రిక సమ్మె లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ఏపిసిఓఎస్ కూడా రద్దుచేసి పాత కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలని, చూస్తున్నారని, కావున ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో,సుధాకర్,ఎం. నాగరాజు, ప్రవీణ్,నాగమ్మ, రాణి,సుశీల,పలువురు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# సాగునీటి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు : భరించలేని దుర్గంధంతో ప్రజలు

**తెనాలి టౌన్ ఫిబ్రవరి9(ప్రభాతవార్త):** తెనాలి పట్టణంగుండా ప్రవహించే ప్రధాన సాగునీటి కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది.తెనాలి చందోలు ప్రధానరహదారి వెంట,జగ్గడిగుంటపాలెం ఐటీఐ కాలినడక వంతెన వద్ద తూర్పుకాలువలో గత కొన్నినెలలుగా,జంతు కళేబరాలు,ఖాళీ కొబ్బరిబోండాలు మరియు ఇతరవ్యర్థాలతో పేరుకుపోయి విపరీతమైన దుర్వాసన వస్తోంది.ప్రజలు ఈమార్గంలో వెళ్లాలంటే ముక్కుమూసుకోవాల్సిందే. దీనిపై అధికారులకి ఎన్నిసార్లు వివరించినా ఫలితం లేదని, ఆప్రాంతవాసులంటున్నారు. ప్రజల ఆరోగ్యం గురించి అధికారులు పట్టించుకోవట్లేదని,కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి,సమస్యను పరిష్కరించాలని, స్థానికులు కోరుతున్నారు.



